క్లుప్తంగా

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

నేలకొండపల్లి: ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శుక్రవారం నుంచి జూన్ 3 వరకు తేదీవరకు పరీక్షలు జరుగుతాయని, కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఐఈఓ సూచించారు.

ఎంపీ నామ సంతాపం



ఆదిలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ నామ నాగేశ్వరరావు, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి తల్లి మోదుగుల ఆదిలక్ష్మి మృతికి ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం ప్రకటించి, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని రెడ్డిపాలెంకు వెళ్లి ఆదిలక్ష్మి దశ దిన కర్మలో పాల్గొని వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులకు నామ సానుభూతి తెలిపారు.

గౌతమ బుద్ధుడికి నివాళి

ఖమ్మం మామిళ్లగూడెం: గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలో గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుద్దెటి వీరభద్రం, సుధాకర్, లూర్దు, పాగాయోనా, గాదిరి బాబు, దాసరి శ్రీనివాస్, టి.శ్రీనివాస్, గంగాధర్, భాస్కర్, పేతురు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోల్ కారిడార్ ఏర్పాటుపై హర్షం

ఖమ్మం మామిళ్లగూడెం: సింగరేణి విస్తరించి నాలుగు జిల్లాలను కలుపుతూ కోల్ కారిడార్ రైల్వే మార్గం నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమయమైందని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గత 25 ఏళ్లుగా కాగితాలకే పరిమితమైన రామగుండం, మణుగూరు రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసిన తరుణంలో ప్రధాని మోదీ, రైల్వే శాఖమంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వేశాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బల్లేపల్లి వద్ద గురువారం రెండు ఆటోలు ఢీకొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం వైపు నుంచి వెళ్తున్న ఆటో బల్లేపల్లి సెంటర్ దాటాక యూటర్న్ తీసుకుంటుండగా మరో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. అయితే, క్షతగాత్రుల వివరాలు తెలియరాలేదు.

నేడు 'నల్లమల' వర్ధంతి

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ ఉప ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పాత బస్టాండ్ వద్ద గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక, 10 గంటలకు గిరి ప్రసాద్ భవన్‌లో వర్ధంతి సభ జరుగుతుందని ఈ సభలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. పార్టీ కార్యకర్తలు, గిరిప్రసాద్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	40	బచ్చలికూర	4
వంకాయ	50		20
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	90		20
కాకర	60	చుక్కకూర	3
బీర	70		20
దొండ	34	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	35		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం



డ్రెయినేజీలో వ్యర్థాలను ఎత్తుతున్న కార్మికులు



మురుగును తొలగిస్తున్న కార్మికులు



డ్రెయిన్లలో ఎత్తిన మట్టిని ట్రాక్టర్‌లో పోస్తున్న జేసీబీ

ఇక కనుమురుగు..!



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

నగరంలోని 60 డివిజన్లలో ప్రధాన డ్రెయినేజీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేసేందుకు కేఎంసీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. రోజుకు రెండు, మూడు డివిజన్లలో డ్రెయినేజీలను శుభ్రం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 40 మంది కార్మికులను రోజు వారీ కూలీలుగా నియమించారు. ఏ డివిజన్‌లో పనులు చేపడితే ఆ డివిజన్ పారిశుద్ధ్య కార్మికులతో పాటు ఈ కూలీలు డ్రెయినేజీలను శుభ్రం చేయాల్సి ఉంటుంది. పెద్ద డ్రెయిన్లను జేసీబీలతో శుభ్రం చేయిస్తున్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి డ్రెయినేజీల శుభ్రం చేసే పనులపై పలు సూచనలు చేయగా.. ప్రణాళిక ప్రకారం వ్యర్థాలను ఎత్తి బయటకు తరలించేలా చర్యలు చేపట్టారు.

పనులు వేగవంతం..

కేఎంసీలో పారిశుద్ధ్య పనులు వేగవంతం

- డ్రెయినేజీలపై దృష్టి కేంద్రీకరణ
- వ్యర్థాలు, సిల్ట్ తొలగించేలా ప్రత్యేక డ్రైవ్
- రోజుకు రెండు, మూడు డివిజన్లలో చేపడుతున్న పనులు
- మున్సిపల్ కార్మికులతో పాటు మరో 40 మంది అదనంగా..
- వర్షకాలం సమీపిస్తుండడంతో ముందస్తు చర్యలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించారు. వర్షకాలంలో మురుగు నీరు రోడ్లపైకి చేరకుండా ముందస్తుగానే డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులను యంత్రాంగం చేపట్టింది. కేఎంసీ కమిషనర్ సూచనలతో డివిజన్‌లలో ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని 60 డివిజన్లలో ఉన్న డ్రెయినేజీల్లోని వ్యర్థాలు, సిల్ట్ తొలగించి వాటిని బయటకు తరలించేలా చర్యలు చేపట్టారు. డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షాకాలంలో చిన్న జల్లు కురిసినా డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపైకి మురుగు చేరుతోంది. దీంతో ముందస్తుగానే డ్రెయిన్లను శుభ్రం చేస్తే ఆ సమస్యను అధిగమించవచ్చని భావించి ఈ కార్యక్రమానికి కేఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు.

వర్షం వస్తే నరకమే..

డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లుతున్నాయి. నగరంలోని మయూరిసెంటర్, వినోదమహల్ రోడ్డు, పాత బస్టాండ్, కిన్నెర సెంటర్, కమాన్‌బజార్, కస్బా బజార్, త్రైంపోలీస్ స్టేషన్ రోడ్డు, గాంధీచౌక్, ఐటీ హబ్ తదితర ప్రాంతాల్లో ఉన్న డ్రెయినేజీల్లో వ్యర్థాలు, సిల్ట్ కారణంగా కొద్దిపాటి నీరుకే డ్రెయిన్లు పొర్లిపోతున్నాయి. వర్షాకాలంలో ఈ ప్రాంతాల్లోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం వచ్చినప్పుడు పాదచారులు రోడ్డుపై నడిచే పరిస్థితి ఉండడం లేదు. వర్షపునీరు, మురుగునీరు ఏకమై రోడ్డుపై ప్రవహిస్తుండగా, ప్రజలు చేసేది లేక వాటిలోనే నడుస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈ సమస్య తలెత్తకుండా కేఎంసీ అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు.

ముందస్తుగా శుభ్రం చేస్తున్నాం..

వర్షాకాలం సమీపిస్తుండడంతో ముందుగానే డ్రెయిన్లను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టాం. కమిషనర్ ఆదేశాలతో రోజుకు రెండు, మూడు డివిజన్లలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. సకాలంలో డ్రెయినేజీలను శుభ్రం చేసి, మురుగు సమస్యను తొలగిస్తాం.

– శ్రీనివాస్, ఏఈ, ఎన్విరాన్‌మెంట్ విభాగం

డ్రెయినేజీలను పరిశీలించిన కమిషనర్



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 54వ డివిజన్‌లో డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోయి, నీళ్లు నిలిచిపోవడంతో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి గురువారం పరిశీలించారు. డ్రెయినేజీలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్అండ్‌బీ ఈఈ, కేఎంసీ డీఈఈలు కమిషనర్ ఆదేశాలతో డ్రెయినేజీని పగలగొట్టి నిలిచిన వ్యర్థాలను తొలగించారు. నగరంలో ప్రతీ డ్రెయినేజీని శుభ్రం చేయాలని ఆదేశించారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

ఖమ్మంరూరల్: సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ ఎప్పటికప్పుడు పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇప్పటికే అనేక ఉద్యమాలు చేసినట్లు ఇఫ్టూ పాలేరు ఏరియా కమిటీ అధ్యక్షుడు గోసు పుల్లయ్య అన్నారు. గురువారం వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన ఇఫ్టూ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ, హమాలీ, ఆటో, గ్రామపంచాయతీల వర్కర్లు, ఆశా, అంగన్‌వాడీ, మిషన్ భగీరథ, మధ్యాహ్న భోజనం వర్కర్లు, తదితర రంగాల కార్మికుల సమస్యల సాధనే లక్ష్యంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మికుల హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాలను తీసుకొస్తున్నాయని, లాభాల బాటలో నడిచే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా అమ్మేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో కార్మికుల సమస్యలపై ఉద్యమించడానికి, కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి జూన్8న పాలేరులో జరిగే సంఘం మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్యదర్శి రామ్‌దాస్, నాయకులు శీలం లెనిన్, వై.ఉపేందర్, అక్కి నాగరాజు, మాధవరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆరేళ్ల నుంచి విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,200 కోట్లు విడుదల చేయలేదని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఈ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోర్సులు పూర్తి చేసి, ప్రవేశ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించే సమయం వస్తోందని, ఉన్నత చదువుల కోసం కళాశాలలు మారే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యా సంస్థల యాజమాన్యాలు తమ వద్దనే సర్టిఫికెట్లు ఉంచుకుంటున్నారని అన్నారు. వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, బకాయిలను విడుదల చేయాలన్నారు.

యూనిఫాంలు సిద్ధం



పాలేరులో సిద్ధమవుతున్న యూనిఫాంలు

కూసుమంచి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరంలో అందించేందుకు ఏకరూప దుస్తులు (యూనిఫాం) కుట్టే బాధ్యతను మహిళా సంఘాలు తీసుకున్నాయి. జీవన జ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యాన కూసుమంచి, పాలేరు, నాయకన్‌గూడెం, నేలపట్ల గ్రామాల్లో మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో మండలంలోని 3,910 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం సిద్ధం చేస్తున్నట్లు ఏపీఎం సత్యవర్ధన్ రాజు తెలిపారు.

రేపటి నుంచి దశల వారీగా ఆందోళన

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రేపటి(శనివారం) నుంచి దశల వారీగా ఆందోళనలను నిర్వహిస్తున్నట్లు యూఈఈయూ (సీఐటీయూ) కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న డివిజనల్ ఇంజనీర్లకు, 28న సూపరింటెండెంట్ ఇంజనీర్లకు, జూన్ 10న సీఎండీలకు సమస్యలపై సామూహికంగా దరఖాస్తులు ఇవ్వాలని కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ కార్మికులు, ఉద్యోగులు, ఆర్టిజన్లు, మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు, అన్‌మాన్ కార్మికులు పాల్గొనాలని కోరారు. పని భారానికి అనుగుణంగా సిబ్బందిని నియమించాలని, పెండింగ్ డీఏఈలు, ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈ ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.


ప్రశ్నించే గొంతుక ప్రేమేందర్‌రెడ్డి



నేలకొండపల్లి: శంకరగిరితండాలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: ప్రశ్నించే గొంతుక బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గెంటెల విద్యాసాగర్, ఆ పార్టీ నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ అన్నారు. గురువారం ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. ఖమ్మంలోని 45,49 డివిజన్లలో ప్రచారం నిర్వహించిన సందర్భంగా విద్యాసాగర్, నేలకొండపల్లి మండలంలో నిర్వహించిన ప్రచారంలో సుధాకర్‌లు మాట్లాడారు. ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు సుధాకర్, ఇస్లావత్ నాగేశ్వరరావు, వీరు నాయక్, ఉదయ్, గోపి, బూత్ అధ్యక్షుడు నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతా..



ఓట్లు అభ్యర్థిస్తున్న క్రాంతికుమార్

ఖమ్మం మామిళ్లగూడెం: తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే చట్టసభల్లో నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతానని ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి, తెలంగాణ ఉద్యమకారుడు తాడిశెట్టి క్రాంతికుమార్ తెలిపారు. గురువారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్, తదితర ప్రాంతాల్లో ఓట్లను అభ్యర్థించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రిటైర్‌మెంట్ తర్వాత ఇస్తున్న మాండ్ సిస్టమ్‌ను రద్దు చేసి తక్షణమే పూర్తి నగదును నేరుగా ఖాతాల్లో వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.

విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలి



కూసుమంచి: మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

కూసుమంచి/ఖమ్మంరూరల్: విత్తనాలు, ఎరువులను చట్టాలకు లోబడి విక్రయించాలని లేనపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర హెచ్చరించారు. గురువారం కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలం పాస్నేకల్ రైతువేదికలో నిర్వహించిన విత్తన, ఎరువుల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ దుకాణదారులు లైసెన్సులు కలిగి ఉండి వాటిని కనపడేలా ఉంచాలన్నారు. స్టాక్ పుస్తకాలను సక్రమంగా నిర్వహిస్తూ.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ధరలను బోర్డుపై రాయాలని, రైతులకు అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలన్నారు. కృత్రిమ విత్తనాల కొరత, రైతులు అడిగిన బ్రాండ్లు కాకుండా వేరే ఇచ్చినా, ఎరువులను అధిక ధరలకు విక్రయం లాంటి ఫిర్యాదులు వస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే రైతులు కొనుగోలు చేయొద్దని, తమకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఏదులాపురం సొసైటీ కార్యాలయంలో రైతులకు జీలుగు, జనుము విత్తనాలను సబ్సిడీపై అందించారు. ఈసమావేశంలో ఏఓలు వి.నాగేశ్వరరావు, వాణి, సొసైటీ సీఈఓ మహమూద్ అలీ, ఏఈఓలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమతంగా ఉండాలి..

నేలకొండపల్లి: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమతంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మండలంలోని పైనంపల్లి, నేలకొండపల్లి గ్రామాల్లో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. ఇళ్లకు వచ్చి అమ్మే నకిలీ విత్తనాలను ఎవరూ కొనుగోలు చేయొద్దని, లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద మాత్రమే కొనాలని సూచించారు. అనంతరం పంట అవశేషాలను తగలబెట్టడం వలన జరిగే అనర్థాలు, జనుము, జీలిగులు, పిల్లిపెసర, వేసవి దుక్కుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు దుర్గాభవాని, అవినాష్, ఉదయ్‌కిరణ్, రామకృష్ణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



జీలుగులు పంపిణీ చేస్తున్న సొసైటీ బాధ్యులు

నేలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రైతులకు సబ్సిడీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రాజారాంపేట చైర్మన్ దీరవాత్ బాలాజీ సూచించారు. గురువారం మండలంలోని చెరువుమాధారం గ్రామంలో రాజారాంపేట సొసైటీ ఆధ్వర్యాన రైతులకు జీలుగులు, జనుములను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం సబ్సిడీపై అందిస్తుండగా.. రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకుని సొసైటీకి వస్తే అందిస్తారని సూచించారు. రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ రామకోటేశ్వరరావు, సిబ్బంది కె.నరేష్, గోపి, రాము, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు భారీ మెజార్టీ అందిద్దాం..



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, పాలేరు ఎన్నికల ఇన్‌చార్జ్ రఘునాథ్‌యాదవ్ ముఖ్య కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా గొంతుకను చట్టసభల్లో వినిపించేందుకు తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు గ్రామగ్రామాన పట్టభద్రుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాల్సిన ఆవశ్యకత వివరిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సీనియర్ నాయకురాలు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, జెడ్పీటీసీ బెల్లం శ్రీను, ఎంపీపీ మంగీలాల్, క్లైం వెంకటరెడ్డి, నాయకులు నెల్లూరి భద్రయ్య, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, నెల్లూరి భద్రయ్య, మద్ది మల్లారెడ్డి, మెండెం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపునకు ప్రచారం..

ఖమ్మంవన్‌టౌన్ / రఘునాథపాలెం / ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ.. పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. ఈ నేపథ్యాన ఖమ్మంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ పట్టభద్రులను కలిసి ప్రచారం చేయగా.. రఘునాథపాలెంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం చేశారు. ప్రజల పక్షాన కొట్లాడే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించి చట్టసభల్లోకి పంపాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా, తీన్మార్ మల్లన్నకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేట్ చైర్మన్ ముత్తినేని వీరయ్య గురువారం ఖమ్మం ప్రకాశ్‌నగర్‌లో జరిగిన వికలాంగ పట్టభద్రుల సమావేశంలో ఆయన తెలిపారు.

ముఖ్య నేతలతో మంత్రి తుమ్మల సమావేశం

ఖమ్మంవన్‌టౌన్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మం నియోజకవర్గ ముఖ్యనాయకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, నూకల నరేష్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, చావా నారాయణరావు, మందడపు మనోహర్, పాలెపు వెంకటరమణ, నాగండ్ల దీపక్‌చౌదరి, రావూరి సైదుబాబు, పోట్ల వీరేందర్, తదితరులున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

బీఆర్ఎస్ ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన ప్రచార రథాలను గురువారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈనేపథ్యాన బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. నగరంలోని 44, తదితర డివిజన్ల పరిధిలో ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ గుండాల కృష్ణ పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, కన్నం ప్రసన్న, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాలలు సామాజిక రంగంలో ముందుండాలి



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: పేదలకు సేవ చేసేందుకు కృషి చేయాలని, మాలలు సామాజిక రంగంలో ముందుండాలని కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ పిలుపునిచ్చారు. గురువారం యూనిటీ ఆఫ్ మాల జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం పోలియో హోం ఆత్మీయుల సన్మాన సభ నిర్వహించారు. ఇంటర్నేషనల్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ జాగుంట్ల శ్రీనివాసరావు, ఏపీజే అబ్దుల్‌కలాం అవార్డు గ్రహీత మోటపోతుల బాబురావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీజీ క్లైమెంట్ మాట్లాడుతూ.. నిజ జీవితంలో అనేక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఎదుర్కొంటూ నిలబడడంతో పాటు సమాజ సేవ చేయడం గొప్ప విషయం అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందుల ఉపేందర్, మధు, కార్యనిర్వాహక అధ్యక్షుడు మధు, కనకయ్య, కోటేశ్వరావు, ఎల్లయ్య, పిల్లి విజయపాల్, బాబు, లక్ష్మణ్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.